క్లుప్తంగా

ఘనంగా రథసప్తమి వేడుకలు



సూర్య నమస్కారాలు చేస్తున్న ట్రిపుల్ ఐటీ అధికారులు, విద్యార్థులు

వేంపల్లె : ప్రత్యక్ష దైవమైన సూర్య భగవానుడిని పురస్కరించుకుని ఇడుపులపాయ ఆర్కే వ్యాలీ క్యాంపస్‌లో రెండు రోజులు పాటు ఘనంగా రథసప్తమి వేడుకలు నిర్వహించినట్లు డైరెక్టర్ ఏవీఎస్ కుమార్ స్వామి గుప్తా తెలిపారు. మాఘ మాసంలో వచ్చే శుక్లపక్ష సప్తమిరోజున ప్రతి ఏడాది రథసప్తమిగా జరుపుకుంటారని, సూర్య భగవానుడిని ఉదాహరణగా తీసుకుని మనం మన జీవితంలోనేకాక ఇతరుల జీవితాలలో కూడా వెలుగులు నింపాలన్నారు. 108 సూర్య నమస్కారాలు చేయడంవలన మన శరీరంలోని 108 నాడులు ఉత్తేజితమై ఆరోగ్యంగా ఉంటాయన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.

రీసర్వే పక్కాగా చేపట్టాలి



కొండూరు పొలాల్లో రీసర్వేను పరిశీలిస్తున్న జాయింట్ కలెక్టర్ అదితి సింగ్

పెండ్లిమర్రి : రైతులకు భూసమస్యలు రాకుండా రీసర్వే పక్కాగా చేపట్టాలని జాయింట్ కలెక్టర్ అదితి సింగ్ తెలిపారు. బుధవారం మండలంలోని కొండూరులో చేపడుతున్న రీసర్వేను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులకు ఇబ్బందులు లేకుండా ప్రతి ఒక్క ఎకరా రీ సర్వే చేపట్టాలని అధికారులకు సూచించారు. ప్రతి భూమికి సర్వే హద్దులు ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ అనురాధ, ఆర్ఐ శ్రీనువాసులు, సర్వేయర్ శివ ప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు.

మందుబాబులకు నిలయంగా కాంగ్రెస్ పార్టీ కార్యాలయం



పులివెందులలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయం

పులివెందుల రూరల్ : పట్టణంలోని శ్రీనివాస హాలు సమీపంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ కార్యాలయం అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా మారుతోంది. పులివెందుల ప్రాంతంలో కాంగ్రెస్ పార్టీకి సంబంధించిన నాయకులు ఎవరూ లేకపోవడంతో కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని పట్టించుకునేవారే లేరు. దీంతో రాత్రి సమయాలలో మందుబాబులు మందు సేవిస్తూ సీసాలు పగులకొడుతూ కార్యాలయాన్ని అంతా మందు బాబుల నిలయాలుగా మార్చేశారు.

వ్యాసరచన పోటీల్లో విద్యార్థిని ప్రతిభ



విద్యార్థిని ఉషతో కరస్పాండెంట్ బీఎస్ రమణారెడ్డి

వేంపల్లె : మండల స్థాయి వ్యాసరచన పోటీల్లో స్థానిక ఉషాకిరణ్ ఉన్నత పాఠశాల విద్యార్థిని ప్రథమ బహుమతి సాధించినట్లు ఆ పాఠశాల కరస్పాండెంట్ బీఎస్ రమణారెడ్డి తెలిపారు. బుధవారం జంతు సంక్షేమ పక్షోత్సవాల సందర్భంగా స్థానిక విద్యా వనరుల కేంద్రంలో వ్యాసరచన పోటీలు నిర్వహించారు. తమ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న విద్యార్థిని పి.వి.ఉష పోటీలలో పాల్గొని ప్రథమ బహుమతి కైవసం చేసుకున్నట్లు వెల్లడించారు. పశుసంవర్ధక శాఖ ఉప సంచాలకులు డాక్టర్ కె.మంగేశ్వర రావు చేతుల మీదుగా విద్యార్థిని ఉషకు జ్ఞాపిక, ప్రశంస పత్రాన్ని అందజేశారన్నారు.

నిధులు కేటాయించకపోవడం అన్యాయం

జమ్మలమడుగు రూరల్ : కడప ఉక్కు నిర్మాణం కోసం కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో నిధులు కేటాయించకపోవడం చాల అన్యాయమని సీఐటీయూ పట్టణ కార్యదర్శి దాసరి విజయ్ అన్నారు. బుధవారం కార్మిక వ్యతిరేక చట్టాలను రద్దు చేయాలని నిరసిస్తూ పట్టణంలోని గాంధీ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మిక వర్గం ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని కేంద్ర ప్రభుత్వం కార్మిక వ్యతిరేక చట్టాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. 29 కార్మిక చట్టాలను రద్దు చేసి 4 కోడ్‌లుగా తీసుకుని రావడం దుర్మార్గమన్నారు. విభజన చట్టంలో ఆంధ్రప్రదేశ్‌లోని వైఎస్సార్ జిల్లాలో స్టీల్‌ప్లాంట్ ఏర్పాటుకు ఏమాత్రం పట్టించుకోవడం లేదన్నారు. రాష్ట్రంలో ఉన్న కాంట్రాక్టు కార్మికుల సమస్యలన్నింటిని పరిష్కారించాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ ఉపాధ్యక్షుడు వినయ్‌కుమార్, భారతి ఆటో వర్కర్స్ యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

సచివాలయ వ్యవస్థపై నిర్లక్ష్యం

- నిర్వీర్యం చేసేందుకు కూటమి ప్రభుత్వం ఎత్తుగడ
- అలంకారప్రాయంగా కార్యాలయాలు
- నామమాత్రంగా సిబ్బంది హాజరు
- ప్రజలకు అందని సేవలు



ఇల్లూరు గ్రామ సచివాలయం



ఇల్లూరు గ్రామ సచివాలయంలో సిబ్బంది లేక ఖాళీగా ఉన్న కుర్చీలు(ఫైల్)

ఎర్రగుంట్ల : మండల కేంద్రానికి దూరంగా ఉండే గ్రామాల ప్రజలు 2019 సంవత్సరానికి ముందు వరకూ ప్రతి చిన్న సమస్యకు తహసీల్దార్ కార్యాలయానికో, మండల పరిషత్ కార్యాలయానికో పరుగులు పట్టేవారు. ఈ క్రమంలో ఎన్నో ఇబ్బందులు పడేవారు. కూలిపని చేసుకునే వారైతే పనులు మానుకుని రోజంతా కార్యాలయాల చుట్టూ తిరిగేవారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక ఈ పరిస్థితికి చెక్ పట్టేలా విప్లవాత్మంగా నిర్ణయాలు తీసుకున్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో పనులు నిమిత్తం గ్రామీణ ప్రాంత ప్రజలు మండల, జిల్లా, కేంద్రాలకు రావాల్సిన పనిలేకుండా సచివాలయ వ్యవస్థను అందుబాటులోకి తెచ్చారు. నాటి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రూ.కోట్లు ఖర్చు పెట్టి భవనాలు నిర్మించింది.

ఎన్నో సేవలు..

మండలంలో 17 సచివాలయాలను ఏర్పాటు చేశారు. ఒక్కో భవనాన్ని సుమారు రూ.40 లక్షలు వెచ్చించి నిర్మించారు. 11 శాఖల అధికారులను అక్కడ ఉంచి ఎన్నో సేవలను అందించారు. ఆధార్‌లో మార్పులు చేర్పులు, విద్యార్హత ధృవీకరణ పత్రాలు అవసరమైన వారు వెంటనే సమీపంలో ఉన్న సచివాలయానికి వెళ్తే సకాలంలో అందేవి. సంక్షేమ పథకాలు సులువుగా దరఖాస్తు చేసుకునే పరిస్థితులు నాడు ఉన్నాయి. కూటమి ప్రభుత్వం వచ్చాక సచివాలయ వ్యవస్థను పూర్తిగా నిర్లక్ష్యం చేస్తోంది. వాటి అభివృద్ధి, ప్రజలకు సకాలంలో సేవలు గురించి పట్టించుకోవడం లేదు. ప్రస్తుతం కార్యాలయాల్లో సిబ్బంది నామమాత్రంగా కనిపిస్తున్నారు. దీంతో గతంలో వైఎస్సార్ ప్రభుత్వం హయాంలో కళకళలాడిన గ్రామ సచివాలయాలు నేడు కూటమి ప్రభుత్వ వైకరి కారణంగా వెలవెలబోతున్నాయి.

సిబ్బంది కొరత ఉంది



మండలంలో 17 సచివాలయాలలో 17 మంది పంచాయతీ కార్యదర్శులకు గాను 12 మంది మాత్రమే ఉన్నారు. చిలంకూరులో 2, తిప్పలూరు 1, మాలెపాడు 1, చిన్నదండ్లూరు 1 ఖాళీలు ఉన్నాయి. మొత్తం 133 సిబ్బందికి గాను 110 మంది మాత్రం పనిచేస్తున్నారు. ఖాళీలను జిల్లా ఉన్నతాధికారులకు తెలియజేశాము. త్వరలోనే అన్ని సమస్యలను పరిష్కరిస్తాం.

\- వెంకటమణయ్య, ఎంపీడీఓ ఎర్రగుంట్ల

సేవలను అందుబాటులోకి తేవాలి



గతంలో చాలా రకాల సేవలు సచివాలయాల్లో అందుబాటులో ఉండేవి. ప్రస్తుతం వివిధ శాఖల సిబ్బంది అందుబాటులో ఉండటం లేదు. దీనికి తోడు ఆధార్ సేవలు లభించడం లేదు. సచివాలయాల్లో అన్ని రకాల సేవలు అందుబాటులోకి తీసుకురావాలి. ఖాళీలన్ని భార్తీ చేయాలి.

\- తమ్మిశెట్టి బాలయ్య, జెడ్పీటీసీ, ఎర్రగుంట్ల

'పులివెందుల గురించి తెలుసుకుని మాట్లాడమ్మా'



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

పులివెందుల టౌన్ : మంత్రి సవిత పులివెందులలో నీటి కరువు ఉందని మాట్లాడటం చాలా విడ్డూరంగా ఉందని మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ చిన్నప్పలు బుధవారం పట్టణంలోని వైఎస్ మనోహర్‌రెడ్డి నివాసంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో తెలిపారు. బుధవారం మంత్రి సవిత ఆధ్వర్యంలో జరిగిన జిల్లా అభివృద్ధి సమీక్షా సమావేశంలో ఆమె మాట్లాడుతూ పులివెందుల నియోజకవర్గంలో చెరువులు ఎండిపోయాని అనడంతో ఒక్క చెరువు ఎండిపోయినది ఉంటే చూపించగలరా అని వారు ధ్వజమెత్తారు. గత టీడీపీ ప్రభుత్వంలో నీటి ఎద్దడి తలెత్తితే సొంత నిధులతో ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నేత వైఎస్ మధురెడ్డిలు 17 ట్యాంకర్లు పెట్టి నీటిని సరఫరా చేయించిన ఘనత వారిదేనన్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో కనంపల్లె వద్ద ఏడు బోర్లు వేసి యుద్ధ ప్రాతిపదికన పైపులైన్ వేసి పులివెందులకు నీళ్లు అందించిన ఘనత వైఎస్ కుటుంబ సభ్యులే దక్కుతుందన్నారు. 15 ఆర్థిక సంఘం కింద రూ.55 లక్షలు వచ్చిన డబ్బులను బోర్లు వేసి డబ్బును వృథా చేసిన ఘనత కూటమి ప్రభుత్వానిదేనన్నారు. పులివెందులకు తాగునీటి సౌకర్యం కల్పించే నక్కలపల్లి స్టోరేజ్ ట్యాంక్‌లో నిండుగా నీళ్లు ఉన్నాయని, వాటిని పంపింగ్ చేసే మోటార్ల మరమ్మతు పనులు చేయడానికి కూడా నిధులు లేకుండా చేసి, కాంట్రాక్టర్లు పనులు చేయాలంటే బిల్లులు ముందుకుపోకుండా చేసి ఇప్పుడు ప్రజల ముందు డ్రామాలాడుతున్నారన్నారు. మున్సిపల్ కౌన్సిల్ ఆధ్వర్యంలో దాదాపు రూ.50లక్షల ఆర్థిక సంఘం నిధులతో మోటార్లను రిపేరు చేయడానికి, కొత్త వాటిని ఏర్పాటు చేయడానికి నిధులు మంజూరు చేయడం జరిగిందని, అధికారంలో లేకపోయినా మేమే అతి త్వరలో సమస్యకు పరిష్కారం చూపిస్తామన్నారు. చేతనైతే ప్రభుత్వం దగ్గర నిధులు తీసుకొచ్చి పులివెందుల అభివృద్ధికి సహకరించాలన్నారు. నియోజకవర్గంలో చెరువులు, కుంటలు, వాగులు, వంకలు, నీటితో కళకళలాడుతున్నాయన్నారు. రైతులు ఈరోజు రెండు పంటలు పండించుకుంటూ ఆనందంగా ఉన్నారన్నారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ హఫీజ్, మాజీ డైరెక్టర్ గంగాధర్‌రెడ్డి, నూర్ బాషా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రసూల్, జేసీఎస్ ఇన్‌చార్జి పార్నపల్లి కిశోర్, కౌన్సిలర్ కోడి రమణ, ఖాదర్ బాషా, వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు తాగునీటి సరఫరాకు అంతరాయం

పులివెందుల టౌన్ : పట్టణంలోని భాకరాపురం, నగరిగుట్ట ప్రాంతంలోని మంగళ కాలనీ, ఎస్సీ కాలనీ, క్రిష్టియన్‌లైన్, నగరిగుట్ట, సియోన్‌పురం ప్రాంతంలోని అహోబిలాపురం, శ్రీనివాస థియేటర్ వెనుక ప్రాంతాలలో గురువారం తాగునీటి సరఫరాకు అంతరాయం ఉంటుందని మున్సిపల్ కమిషనర్ రాముడు తెలిపారు. నక్కలపల్లె సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ వద్ద ఎలక్ట్రిక్ సమస్య కారణంగా తాగునీటి సరఫరా ఉండదని, ఈ విషయాన్ని ప్రజలు గమనించాలన్నారు. ఈనెల 7వ తేదీ నుంచి యథావిధిగా నీటి సరఫరా ఉంటుందన్నారు.

అనాథ వృద్ధులకు అన్నదానం

వేంపల్లె : స్థానిక రాజీవ్ కాలనీలోని అమ్మ శరణాలయంలో వేంపల్లె ఆర్యవైశ్య ఆఫీసియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (అవోపా), అవోపా మహిళా విభాగ్ ఆధ్వర్యంలో అనాథ వృద్ధులకు అన్నదానం చేశారు. బుధవారం వేంపల్లెకు చెందిన పోలేపల్లి రామాంజనేయులు, సతీమణి లక్ష్మీజ్యోతిల వివాహ వార్షికోత్సవ సందర్భంగా వారి సహకారంతో అనాథ వృద్ధుల అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

నేత్రదానం

లింగాల : మండలంలోని కర్ణపాపాయపల్లెకు చెందిన కర్ణ వెంకటలక్షుమ్మ మృతి చెందింది. ఆమె కుటుంబ సభ్యులు నేత్రదానానికి అంగీకరిస్తూ నేత్ర సేకరణ కేంద్ర అధ్యక్షుడు రాజుకు సమాచారమిచ్చారు. రాజు కార్నియాలను సేకరించి హైదారాబాద్‌లోని డాక్టర్ అగర్వాల్ నేత్రనిధికి పంపించారు.

జూదరుల అరెస్ట్

లింగాల : మండలంలోని ఎగువపల్లి దిగువపల్లి గ్రామాల మధ్య కోడిపందాల స్థావరాలపై బుధవారం పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో రెండు కోళ్లను స్వాధీనం చేసుకుని వారి వద్ద ఉన్న రూ.5200 నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ మధుసూదన్ రావు తెలిపారు. మొత్తం ఆరు మంది జూదర్లు ఉండగా నలుగురు పరారయ్యారన్నారు. ఇద్దరిని అరెస్ట్ చేసి కేసు నమోదు చేశామన్నారు. పరారైన వారికోసం గాలింపు చర్యలు చేపట్టామన్నారు.

బాల్యారంభదశలో శారీరక ఎదుగుదల ఎంతో అవసరం



మాట్లాడుతున్న ఐసీడీఎస్ సీడీపీఓ సునీత

వేంపల్లె : బాల్యారంభ దశలో శారీరక ఎదుగుదల ఎంతో అవసరమని ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీఓ సునీత తెలిపారు. బుధవారం మండలంలోని వివిధ అంగన్‌వాడీ కేంద్రాల్లో 'ఎర్లీ చైల్డ్ హుడ్ కేర్ అండ్ ఎడ్యుకేషన్ డే' నిర్వహించారు. బాల్యం ఆరంభ దశ సంరక్షణ, విద్యపై పిల్లల తల్లులకు అవగాహన కల్పించారు. అనంతరం సీడీపీఓ మాట్లాడుతూ బిడ్డకు 6 ఏళ్లు వచ్చేసరికి మెదడు 90 మేర అభివృద్ధి చెందుతుందని, ఆ సమయంలో బిడ్డ శారీరక ఎదుగుదల చాలా ప్రాముఖ్యత వహిస్తుందన్నారు. 0–6 ఏళ్ల గల పిల్లల దశను బాల్య ఆరంభ దశగా గుర్తిస్తామని, పెరుగుదల పర్యవేక్షణను ప్రతినెలా బరువు, ఎత్తును తీయడం ద్వారా తెలుస్తుందన్నారు. వయసుకు తగిన బరువు, ఎత్తు, అలాగే ఎత్తుకు తగిన బరువు ఉంటే బిడ్డ శారీరక, మానసిక అభివృద్ధిని అంచనా వేయవచ్చునన్నారు. ప్రతి నెలా క్రమం తప్పకుండా బిడ్డ బరువు, ఎత్తు తీయించి, పెరుగుదల దశను ప్రతి తల్లి తెలుసుకోవాలని సూచించారు. బిడ్డ పెరుగుదల, పోషణ పర్యవేక్షణపట్ల తల్లి జాగ్రత్త వహించాలన్నారు. ప్రభుత్వం ద్వారా అందే పోషక పదార్థాలు తప్పకుండా పిల్లలకు అందించాలన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ స్వర్ణలత, అంగన్‌వాడీ కార్యకర్త శైలజ, ఆశా కార్యకర్తలు, పిల్లల తల్లులు పాల్గొన్నారు.

నీటిలో గంబూసియా చేపలు విడుదల



అంకాలమ్మగూడూరు చెరువులో గంబూసియా చేపలను వదులుతున్న ఆరోగ్య సిబ్బంది

సింహాద్రిపురం : దోమల నియంత్రణకు నీటిలో గంబూసియా చేపలు విడుదల చేసినట్లు మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ సిద్ధయ్య తెలిపారు. బుధవారం మండలంలోని అంకాలమ్మ గూడూరు, బలపనూరు గ్రామాల్లోని చెరువులలో ఆరోగ్య సిబ్బంది దోమల నియంత్రణకు దోమ లార్వాను ఆహారంగా తీసుకునే గంబూసియా చేపలను విడుదల చేశారు. ప్రభుత్వ అధికారులు, సిబ్బంది దోమలను నియంత్రించేందుకు, వాటిని నాశనం చేసేందుకు ఈ సీజన్‌లో చెరువులు చిన్న, చిన్న కుంటల్లో నీటి నిల్వలు ఉండే ప్రదేశంలో గంబూసియా చేప పిల్లలను వదులుతుంటారన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

తొండూరులో..

తొండూరు : గ్రామ సమీపంలోని చెరువు, నీటి కుంటలలో ఆరోగ్య సిబ్బంది దోమల నివారణకు గంబూసియా చేపలను విడుదల చేశారు. ఈ సందర్భంగా మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ సిద్ధయ్య మాట్లాడుతూ వర్షాకాలంలో సహజంగా దోమలు విజృంభిస్తుంటాయని, వాటి నివారణకు గంబూసియా చేపలు ఎంతో తోడ్పడుతాయన్నారు.

అవగాహనతోనే వారసత్వ సంపదకు రక్షణ

కడప కల్చరల్ : నేటితరం బాలలకు వారసత్వ సంపద విలువపై అవగాహన కల్పిస్తేనే దాన్ని రక్షించుకోవచ్చని వైఎస్సార్ ఆర్కిటెక్చర్ యూనివర్శిటీ వీసీ డాక్టర్ విశ్వనాథ్‌కుమార్ అన్నారు. భారత జాతీయ కళా సంస్కృతి వారసత్వ పరిరక్షణ సంస్థ (ఇంటాక్) ఆధ్వర్యంలో బుధవారం నగరంలోని ఎస్వీ ఇంజనీరింగ్ కళాశాలలో విద్యార్థులకు సెలబ్రేటింగ్ ఇండియా పేరిట పోస్టర్ తయారీ పోటీ నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ ప్రపంచంలో అపురూపమైన వారసత్వ సంపద ఉందని, మన దేశం ఏమాత్రం తక్కువ కాదని, రాయలసీమలో కూడా ఎంతో విలువైన వారసత్వ సంపద ఉందన్నారు. ఇంటాక్ జిల్లా కన్వీనర్ లయన్ కె.చిన్నపరెడ్డి మాట్లాడుతూ సంస్థ ఆధ్వర్యంలో మన చరిత వారసత్వ బులిటిన్‌ను ప్రతినెలా ప్రచురిస్తున్నామని, ఈ మాసం నుంచి ఉభయ తెలుగు రాష్ట్రాలలో కూడా ఈ పత్రిక అందుబాటులో ఉంటుందన్నారు. ఎస్వీ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ వీర సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ ఇంటాక్ సేవలు విలువైనవన్నారు. లయన్స్ క్లబ్ ఆఫ్‌కడప అన్నమయ్య జిల్లా అధ్యక్షులు ఎ.వెంకటసుబ్బయ్య, పూర్వ అధ్యక్షులు పోతుల వెంకట్రామిరెడ్డి, ఎస్సీ సంక్షేమశాఖ ఉప సంచాలకులు డాక్టర్ వల్లూరు బ్రహ్మయ్య పోటీలను పర్యవేక్షించారు. కార్యక్రమంలో కో కన్వీనర్ టీవీ సుబ్బారెడ్డి, సభ్యులు, కె.సంజీవరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ సుబ్బారెడ్డి, టెక్నికల్ విభాగం ప్రతినిధులు రాఘవేంద్రవర్మ, సుభక్త్ తాహీన్, బాలోత్సవ్ ప్రతినిధి వి.నాగమల్లారెడ్డి, కొండారెడ్డి, భారవి, వెల్లాల వెంకటేశ్వరాచారి, మంజులారెడ్డి, జోసిఫినమ్మ, గౌరీశంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా :

నగరానికి చెందిన 119 మంది విద్యార్థులు పోస్టర్ డిజైనింగ్ పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. వీరికి ఇంటాక్ రీజినల్ స్థాయి బహుమతులు ఇవ్వనున్నారు. అనంతరం జాతీయ స్థాయిలో మళ్లీ పోటీ నిర్వహిస్తారు.

విద్యార్థినుల ఆరోగ్య సమస్యలపై అవగాహన సదస్సు



విద్యార్థినులకు బహుమతులను అందిస్తున్న డాక్టర్ శరణ్య

పులివెందుల టౌన్ : పులివెందులలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో బుధవారం కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి.శ్రీనివాసులు అధ్యక్షతన ఉమెన్ సెల్ ఆధ్వర్యంలో ఆరోగ్యం–పరిశుభ్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రముఖ గైనకాలజిస్ట్ డాక్టర్ శరణ్య హాజరై మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో మహిళలు ఎదుర్కొంటున్న ఆరోగ్య సమస్యలపై విద్యార్థినులతో చర్చించారు. రక్తహీనత సమస్యలు, రుతు సమస్యలపై అవగాహన కల్పించారు. మహిళలు ప్రస్తుతం కుటుంబ నిర్వహణలో తమ ఆరోగ్యాలను నిర్లక్ష్యపరచుకోకుండా ఎప్పటికప్పుడు జాగ్రత్త వహించాలన్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ కళాశాల సమయంలో విద్యార్థినులకు అనారోగ్య సమస్యలు ఉత్పన్నమైనప్పుడు కళాశాల ఉమెన్ సెల్ ద్వారా తగిన జాగ్రత్తలు తీసుకుని డాక్టర్‌ను సంప్రదించి తగిన నివారణ చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం సంక్రాంతి సంబరాల సందర్భంగా నిర్వహించిన ముగ్గుల పోటీలు, వంటలు పోటీలకు బహుమతుల కొరకు ఆర్థిక సహాయం చేసిన ఎస్.బి.ఎస్ గార్మెంట్స్, షూమార్ట్, పబ్బతి టెక్స్ టైల్స్‌ల ఆధ్వర్యంలో డాక్టర్ శరణ్య, మా ఊరి సినిమా ప్రొడ్యూసర్ మంజునాథరెడ్డి, ఫిల్మ్ మేకర్ హరి గెలుపొందిన విద్యార్థినులకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో కళాశాల పిఆర్‌ఓ సి.బాలనారాయణ, ఉమెన్ సెల్ కోఆర్డినేటర్ కె.విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పెద్ద శేషవాహనంపై శ్రీవేంకటరమణుడు



ఊంజల్ సేవలో స్వామివారు

పులివెందుల టౌన్ : పట్టణంలో వెలసిన శ్రీవేంకటరమణుడి ఆలయంలో వైభవంగా నిర్వహిస్తున్న శ్రీపద్మావతి సమేత కల్యాణ వేంకటరమణస్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా బుధవారం రాత్రి స్వామివారు పెద్ద శేషవాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. మెయిన్ బజార్, పూలంగళ్ల సర్కిల్, గంగిరెడ్డి ఆసుపత్రి రోడ్డు, ముత్యాల వారి వీధి, గాడిచర్ల వీధి, అమ్మవారిశాల వీధుల మీదుగా గ్రామోత్సవంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ప్రధాన అర్చకులు వరదాచార్యులు ఉదయం సుప్రభాత సేవ.. తోమాల సేవతోపాటు ధ్వజారోహణం చేపట్టారు. సాయంత్రం సహస్రనామార్చన, నివేదన, యాగశాల ప్రవేశం, పుణ్యాహక వాచనం, నిత్య హోమం, వాస్తు హోమంతోపాటు తదితర పూజలు నిర్వహించారు. ఉభయ దారులతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం సహస్ర దీపాలంకరణ ఊంజల్ సేవలు నిర్వహించి స్వామివారి గ్రామోత్సవం నిర్వహించారు.

బ్రాహ్మణులకు లబ్ధి చేకూర్చే పథకాలను అమలు చేయాలి



మంత్రి సవితకు వినతిపత్రం అందిస్తున్న బ్రాహ్మణ సంఘం జిల్లా అధ్యక్షుడు ప్రసాదరావు

వేంపల్లె : రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసే పథకాల్లో బ్రాహ్మణులకు లబ్ధి చేకూర్చే పథకాలను అమలు చేయాలని బ్రాహ్మణ సంఘ జిల్లా అధ్యక్షుడు ప్రసాద్ రావు కోరారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి సవితను బ్రాహ్మణ సంఘ జిల్లా అధ్యక్షుడు కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం ఉన్న విధానం ద్వారా బ్రాహ్మణులకు తక్కువగా లబ్ధి కలుగుతోందని, వారికి లబ్ధిగలిగే పథకాలను పునఃప్రారంభించాలన్నారు. గతంలో మాదిరిగా బ్రాహ్మణ కార్పొరేషన్ పునరుద్ధరించి ఆ పథకాలను తిరిగి అమలు చేయాలని, తొలుత గరుడ పథకాన్ని వెంటనే అమలు చేసి ఎంతోమంది బ్రాహ్మణులను ఆదుకోవాలన్నారు. ఇప్పటికే దాదాపు 100 మందికిపైగా బ్రాహ్మణులు గరుడ పథకానికి దరఖాస్తులు చేసుకున్నారని, అధిక సంఖ్యలో పెండింగ్‌లో ఉన్నాయన్నారు. వెంటనే ఈ పథకం ప్రారంభానికి చర్యలు తీసుకోవాలని మంత్రికి విజ్ఞప్తి చేశారు. కడప జిల్లాలో బీసీ కార్పొరేషన్ కింద బ్రాహ్మణ కార్పొరేషన్ ద్వారా కేవలం 9 యూనిట్లకు మాత్రమే అవకాశం ఇస్తున్నారని, ఆ సంఖ్యను 25కు పెంచాలన్నారు. దరఖాస్తు గడువును ఈనెల 15వ తేదీ వరకు పొడిగించాలన్నారు. అందుకు మంత్రి సమాధానమిస్తూ గడువును పొడిగించే ఆలోచన ఉందని, యూనిట్లను పెంచడానికి పరిశీలన చేస్తున్నట్లు బ్రాహ్మణ కార్పొరేషన్ పథకాలను తిరిగి ప్రారంభించడానికి చర్చలు జరుపుతున్నట్లు తెలిపారు. అలాగే బ్రాహ్మణులకు రాజకీయంగా ప్రాధాన్యత కల్పించడానికి రాబోవు మండల జిల్లా కమిటీలలో బ్రాహ్మణులకు పార్టీ పరంగా పదవులు ఇవ్వాలని, రాజకీయంగా బ్రాహ్మణులు ఎదిగే అవకాశం ఉంటుందని మంత్రికి విన్నవించారు. కార్యక్రమంలో ఇటుకుల పాటి భాస్కరరావు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

రేపు ప్రముఖ వైద్య నిపుణుల రాక

పులివెందుల టౌన్ : పట్టణంలోని భాకరాపురంలో ఉన్న దినేష్ మెడికల్ సెంటర్(ఇసీ గంగిరెడ్డి ఆసుపత్రి)లో శుక్రవారం ప్రముఖ వైద్య నిపుణులు రానున్నట్లు ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. ప్రముఖ చర్మ వ్యాధుల వైద్య నిపుణరాలు డాక్టర్ సోరియాసిస్, తామర, గజ్జి, ఫంగస్ ఇన్ఫెక్షన్, మొటిమలు, బెదులు, దద్దుర్లు, చుండ్రు, బొల్లి, పెదాలు, నోట్లో పక్కులు, సలిపిరి, తల్లి(అమ్మవారు), సభ్యం, మాగురు, అలర్జీ, ఆనెలు, కాళ్ల పగులుట, పులిపిర్లు, పేను కొరుకుట, జుట్టు రాలుట, గోర్లు పుచ్చుట,ముఖం మీద మచ్చలు, చర్మంపై టీబీ మచ్చలు, కుష్టు, ఇతర చర్మ వ్యాధులకు వైద్య పరీక్షలు అందిస్తారన్నారు. చెవి, ముక్కు, గొంతు వ్యాధుల శస్త్ర చికిత్స వైద్య నిపుణులు డాక్టర్ చెవిలో చీము కారుట, చెవి నొప్పి, చెవిలో శబ్దములు, చెవిలో కర్ణభేరికి రంధ్రం, చెవిటి మిషన్లు అమర్చడం, చెవిలో బలపాలు, పూసలు తీయుట, ముక్కు దూలం సరిచేయుట, అలర్జీ, సైనుసైటిస్, ముక్కులో రక్తం కారుటకు, ముక్కులో బలపాలు, పూసలు తీయుట, ముక్కులో గడ్డలకు, ఎండోస్కోపి సైనస్ సర్జరీ, గొంతులో గడ్డలకు శస్త్ర చికిత్స, స్వర పేటికలో లోపాలకు చికిత్స, గొంతులో ఇరుక్కుపోయిన చేప ముల్లులు, నాణేలు తీయుట, గొంతులో ఇన్‌ఫెక్షన్‌కు మాటలు రానివారికి చికిత్స, తలనొప్పి, తల తిరుగుట చికిత్స, తదితర వాటికి వైద్య పరీక్షలు నిర్వహిస్తారు. అలాగే ఆసుపత్రిలో 24గంటలు ఎండోస్కోపీ, కోలనోస్కోపీ పరీక్షలతోపాటు గ్యాస్ట్రబుల్ తీవ్రత తెలుసుకోవడం, చిన్నపిల్లలు నాణేలు, పిన్నులు, సూదులు, ముక్కలు మింగితే తీయడం జరుగుతుందని.. ఎసోఫజిల్ వెరిసెస్‌కు ఎండోస్కోనిక్ బాండిన చేస్తామన్నారు. ఈ అవకాశాన్ని పులివెందుల ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇతర వివరాలకు 08568 286189, 9963170177 ఫోన్ నెంబర్లకు సంప్రదించాలన్నారు.

సస్యరక్షణ చర్యలు చేపడితే అధిక దిగుబడులు



వేరుశనగ పంటను పరిశీలిస్తున్న ఏఓ రమేష్

లింగాల : వేరుశనగ పంటలో సస్యరక్షణ చర్యలు చేపడితే అధిక దిగుబడులు సాధించవచ్చునని మండల వ్యవసాయాధికారి రమేష్ బుధవారం గుణకణపల్లెలో నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో తెలిపారు. అనంతరం రైతులతో కలిసి వేరుశనగ పంటను పరిశీలించి మాట్లాడారు. వేరుశనగ పంటలో పసుపు, చిగురు అట్టలు అమర్చడంవలన తెల్ల దోమ, పచ్చ దోమ ఉధృతిని తగ్గించుకోవచ్చునన్నారు. కార్యక్రమంలో ఆర్ఎస్‌కే సిబ్బంది, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

పవర్ కెపాసిటర్ బ్యాంకు ప్రారంభం



పవర్ కెపాసిటర్ బ్యాంకును ప్రారంభిస్తున్న విద్యుత్ ఏడీ సుధాకర్‌రెడ్డి

సింహాద్రిపురం : మండలంలోని గురిజాల గ్రామ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో నూతనంగా రూ.16 లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన పవర్ కెపాసిటర్ బ్యాంకును బుధవారం విద్యుత్ ఏడీ సుధాకర్‌రెడ్డి ప్రారంభించి మాట్లాడారు. నాణ్యమైన విద్యుత్ అందించడానికి రూ.16లక్షల వ్యయంతో ఈ పవర్ బ్యాంకును ఏర్పాటు చేశామన్నారు. దీనిపై విద్యుత్ సిబ్బందికి సూచనలు, సలహాలు ఇవ్వాలన్నారు. అలాగే విద్యుత్ వినియోగదారులకు బిల్లు చెల్లింపు సులభతరం కొరకు కరెంట్ బిల్లుపై స్కానర్స్ ఏర్పాటు చేశామన్నారు. ఎలాంటి బాధ బందీ లేకుండా మీ ఫోన్ పేలో స్కాన్ చేసి మీ ఇంటి వద్ద నుంచి బిల్లు కట్టడానికి వీలుగా ఉంటుందన్నారు. దీన్ని వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అలాగే కరెంటు బిల్లు పేపర్ ఇస్తున్న వారు కూడా స్కానర్ పూర్తిగా వచ్చేటట్లు చూసి కరెంటు బిల్లు ఇవ్వాలని విద్యుత్ సిబ్బందికి తెలిపారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఏఈ దినేష్, లైన్ ఇన్‌స్పెక్టర్ నాగార్జునరెడ్డి, విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

బుడ్డశనగ పంటలో పంట కోత ప్రయోగం



పంట కోత ప్రయోగంలో దిగుబడిని తూకం వేస్తున్న అధికారులు

వేముల : శనగ పంటపై వేములలో బుధవారం మండల ఏఓ చెన్నారెడ్డి కంపెనీ ప్రతినిధులతో కలిసి శనగ పొలాల్లో పంట కోత ప్రయోగాలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వేముల రెవెన్యూ గ్రామంలో నాలుగు చోట్ల శనగ పంటలో పంట కోత ప్రయోగాలు నిర్వహించామన్నారు. ఈ పంట కోత ప్రయోగంలో శనగ పంట దిగుబడులపై అంచనా వేశామన్నారు. ఒకటవ బ్లాక్‌లో 2.100కేజీలు, రెండవ బ్లాక్‌లో 2.500 కేజీలు, మూడవ బ్లాక్‌లో 1.900కేజీలు, నాల్గవ బ్లాక్‌లో 1.900 దిగుబడులు వచ్చినట్లు లెక్కించామన్నారు. కార్యక్రమంలో ఇన్సూరెన్స్ కంపెనీ ప్రతినిధులు, ఎంపీఈఓలు, రైతులు పాల్గొన్నారు.

దుమ్ముతో ఇబ్బందులు



టిప్పర్లు పోతుండగా వస్తున్న దుమ్ము

ఎర్రగుంట్ల : పట్టణం కాలుష్యకోరల్లో నలిగిపోతుంది. పాలీష్‌మీషన్ల ద్వారా వస్తున్న పాలిష్ మట్టిని అధిక లోడ్‌తో తరలిస్తుండటంలో కింద పడుతుంది. దీని వల్ల పాలీష్‌మట్టి రోడ్డుపై పడి దుమ్ము వ్యాపిస్తుందని పట్టణ ప్రజలు వాపోతున్నారు. ప్రధానంగా వినాయకనగర్ కాలనీ సమీపంలో పాలీస్ మీషన్‌లు అధికంగా ఉన్నాయి. ఈ మీషన్ల ద్వారా వస్తున్న వృథా మట్టిని టిప్పర్లతో తరలిస్తున్నారు. అయితే టిప్పర్ల యజమానులు అధికంగా మట్టిని రాళ్లను వెనుకోవడం వల్ల కింద పడిపోతున్నాయి. దీంతో పాలీస్ దుమ్ము విపరీతంగా వస్తుందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో కాలుష్య దుమ్ముపై తిరుపతిలోని కాలుష్య నియంత్రణ బోర్డుకు కూడా వినయకనగర్ కాలనీ వాసులు ఫిర్యాదులు చేశారు. అయితే వారు కొంత మేర చర్యలు తీసుకున్నారు. మరళ ఇప్పుడు విపరీతంగా దుమ్ము వస్తుందని వారు అంటున్నారు. ఈ దుమ్ము వల్ల శరీరక వ్యాధులు, శ్వాసకోశ వ్యాధులు వ్యాపిస్తున్నాయని పోతున్నారు.

ఇటీవల వ్యాధి బారిన పడి ఓ వ్యక్తికి ఆసుపత్రి ఖర్చులకే సుమారు రూ.40 వేలు అయినటుల్ చెబుతున్నారు. ఇప్పటికైన దీనిపై అధికారులు చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.